క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి సామగ్రి వితరణ



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమానికి బాప్టిస్టు చర్చి డానీ హాల్ షో యువర్ లవ్ అగాపే సౌజన్యంతో వాషింగ్ మెషీన్, గ్యాస్ స్టవ్, నిత్యావసర సామగ్రిని శనివారం అందజేశారు. కార్యక్రమంలో అగాపే సభ్యులు కృపారాజన్, జయకుమార్, మేరీ సరళ, జ్యోతి జయకుమార్, మేరీ బ్లెస్సింగ్టన్, షీలా, నిర్వాహకుడు తమ్మినేని పాండు తదితరులు పాల్గొన్నారు.

చేనేత క్లస్టర్‌కు ఆర్థిక సాయం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పాటూరు గుమ్మల దిబ్బ చేనేత క్లస్టర్‌కు 86 మంది లబ్ధిదారులు చెల్లించాల్సిన సభ్యత్వ నగదును పద్మశాలి సంఘ గౌరవాధ్యక్షుడు చింతలపూడి పెంచలయ్య అందజేశారు. ఈ మేరకు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో చేనేత జౌళి శాఖ కార్యాలయంలో క్లస్టర్ అధికారి ప్రసాద్‌రావు, జౌళిశాఖ అభివృద్ధి అధికారి బాలసుబ్రహ్మణ్యంకు రూ.1.26 లక్షల చెక్కును లబ్ధిదారుల తరఫున శనివారం అందించారు. దీనిపై జిల్లా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బుధవరపు బాలాజీ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుత్తికొండ వెంకయ్య, జానపద రామసుబ్బయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



విగతజీవిగా పడి ఉన్న వ్యక్తి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో మరే ఇతర కారణమో తెలియదు కానీ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మద్రాసు బస్టాండు ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగి బులుగు రంగు టీషర్టు, బులుగు రంగు షాట్ వేసుకుని ఉన్నాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు చిన్నబజారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

స్కిల్స్ పోటీలపై పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు రూరల్: ఇండియా స్కిల్స్ కాంపిటీషన్ 2025 పోస్టర్లను కలెక్టర్ ఆనంద్ కలెక్టరేట్లోని తన చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి 16 నుంచి 25 ఏళ్ల యువత అర్హులుగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. పూర్తి సమాచారం కోసం 99666 01867, 72073 89948 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ పోటీల విజేతలకు అంతర్జాతీయ స్థాయిలో అవార్డును అందిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కళారూపాల ప్రదర్శన రేపు



మాట్లాడుతున్న చిత్రకారిణి సుహాసిని

నెల్లూరు(బృందావనం): పొగతోట గాంధీనగర్‌లోని 'ప్రభవ'లో కళారూపాల ప్రదర్శనను సోమవారం నిర్వహిస్తున్నట్లు పత్ర చిత్రకారిణి, విశ్రాంత అధ్యాపకురాలు సుహాసిని తెలిపారు. ప్రభవ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడారు. తాను వ్యర్థాలతో రూపొందించిన కళా రూపాలతో పాటు పత్ర చిత్రాలను ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. ప్రభవ వ్యవస్థాపకురాలు చంద్రలత, నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి, ఉపాధ్యాయినులు నాగలక్ష్మి, కోకిల పాల్గొన్నారు.

విశేషంగా పవిత్రోత్సవాలు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆరో రోజు శనివారం ఉదయం, రాత్రి నిత్యహోమాలు, సాయంత్రం గోపురోత్సవం గావించారు. భక్తులు విశేషంగా విచ్చేసి స్వామివార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

ఆలయం మూసివేత

చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం సాయంత్రం నుంచి దేవస్థానాన్ని మూసివేస్తున్నట్లు ఈఓ తెలిపారు. సోమవారం ఉదయం శుద్ధిచేసి 9 గంటలకు స్వామివారి దర్శనంతో నిత్యసేవలు ఉంటాయన్నారు.

మూలస్థానేశ్వరాలయంలో..

చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు మూసివేస్తున్నట్లు ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి శనివారం తెలిపారు. సంప్రోక్షణ అనంతరం యథావిధిగా పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యానాదుల సమస్యలను పరిష్కరించండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): యానాదుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా యానాదులు ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన స్పెషల్ గ్రీవెన్స్‌కు తరలివచ్చారు. జిల్లా పరిధిలోని పొదలకూరు, మనుబోలు, రాపూరు, సైదాపురం, కోవూరు, ముత్తుకూరు, నెల్లూరురూరల్, నెల్లూరు సిటీ తదితర ప్రాంతాల నుంచి యానాదులు తరలి వచ్చి ఆర్డీఓ అనూషకు తమ సమస్యలను వివరించారు. తొలుత నగరంలోని వెన్నలకంటి రాఘవయ్య భవనం వద్ద నుంచి ఆర్డీఓ కార్యాలయానికి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, జిల్లా అధ్యక్షుడు మానికల మురళీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరువీధి సతీష్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి యల్లంపల్లి రమేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉష, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోవూరు కృష్ణయ్య, జిల్లా నాయకుడు పొట్టేల నాగరాజు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న యానాదుల సంక్షేమ సంఘం నాయకులు

నిరుద్యోగ యువతకు శిక్షణ

నెల్లూరు సిటీ: గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మల్టీ స్కిల్ టెక్నీషియన్ శిక్షణా కార్యక్రమాలు స్వర్ణా టోల్‌వే, పీపుల్ ట్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు బీవీ నగర్‌లోని సంస్థ కార్యాలయంలో సర్టిఫికెట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వర్ణా టోల్‌వే జీఎం హరి పాండురంగస్వామి, జిల్లా ఉపాధి అధికారి వినయ్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ డీఎస్డీఓ ఖయ్యూమ్, పీపుల్ ట్రీ ఫౌండేషన్ ప్రాజెక్ట్ హెడ్ సురేష్‌రెడ్డి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త బ్యాచ్‌కు శిక్షణా కార్యక్రమం మరో వారం రోజుల్లో ప్రారంభం అవుతుందన్నారు. అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ నియామకాల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పదో తరగతి సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో బీవీనగర్‌లోని పీపుల్ ట్రీ ఫౌండేషన్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు 77299 39702, 74385 00698 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.



సర్టిఫికెట్ల పంపిణీ

విద్యారంగ పరిరక్షణపై సంతకాల సేకరణ

నెల్లూరు (టౌన్): ప్రభుత్వం విద్యారంగాన్ని పరిరక్షించాలని, అందరికీ ఉచిత విద్యను అందించాలని కోరుతూ శనివారం ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక రావూస్ డిగ్రీ కళాశాల వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు త్రినాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యావ్యవస్థ నాశనం అవుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల సంతకాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈనెల 12న డిగ్రీలోని సీఎస్‌పీ, ఇంటర్న్‌షిప్, విధానాలను తొలగించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



నెలాఖరులోగా కేబుల్ వైర్లను తొలగించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెలాఖరులోపు అనధికారంగా విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను నిర్వాహకులు తొలగించాలని, లేనిపక్షంలో విద్యుత్ సిబ్బంది తొలగించాల్సి ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ విజయన్ తెలిపారు. నెల్లూరు సబ్ డివిజన్ పరిధిలోని మిలీనియం, రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్లలో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్తంభాలపై ఉన్న కేబుల్స్ వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. వినియోగదారుల ఫీడ్ బ్యాక్ కీలకమన్నారు. డీఈఈలు సునీల్‌కుమార్, కిరణ్, ఏఈలు కృష్ణవేణి, విజయ్‌కుమార్, మునిశేఖర్, సురేష్, గోపాలకృష్ణ, లక్ష్మీబాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

ఎవరినీ ఉపేక్షించొద్దు

- నగర డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్) : శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటివారైనా ఉపేక్షించవద్దని, కఠినంగా వ్యవహరించాలని నగర డీఎస్పీ పి.సింధుప్రియ సూచించారు. ఆమె చిన్నబజారు పోలీస్ స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. కేసుల పెండెన్సీకి గల కారణాలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సలహాలు, సూచనలిచ్చారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాతనేరస్తులు, ట్రబుల్ మాంగర్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచాలని, క్రమం తప్పకుండా వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావుకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.




రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ సింధుప్రియ

ఇద్దరి నేత్రదానం

నెల్లూరు(అర్బన్): నగరంలోని సూర్యటవర్స్‌లో నివాసం ఉంటున్న చెలంచర్ల శ్రీనివాసరావు(75) శనివారం మధ్యాహ్నం ఆయన నివాసంలో మృతి చెందారు. ఇండియన్ రెడ్‌క్రాస్ కావలి శాఖ చైర్మన్ డి.రవిప్రకాష్ సహకారంతో మృతుని కుటుంబ సభ్యుడు వెంకటకల్యాణ్ చక్రవర్తి ఆయన నేత్రాలను ప్రభుత్వ పెద్దాస్పత్రికి దానం చేశారు. ఎల్వీప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ మృతుడు శ్రీనివాసరావు నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందించారు. కార్యక్రమంలో వాసవి వనిత లెజెండ్ సంఘ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత, అభయం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు ఈవీఎస్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక సంతపేట సమీపంలోని కుక్కలగుంట దుర్గమ్మగుడి సమీపంలో నివసిస్తున్న వేలూరు పెంచలప్రతాప్(40) శుక్రవారం రాత్రి పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికులు చెంగల్పట్టు ప్రతాప్, కంచర్లపల్లి అనిల్‌కుమార్‌ల సహకారంతో మృతుని కుటుంబ సభ్యుడు వేలూరు పెంచలనరసింహులు(మాజీ కార్పొరేటర్) పెంచలప్రతాప్ నేత్రాలను పెద్దాస్పత్రికి దానం చేశారు. దీంతో టెక్నీషియన్ సునీల్ మృతుని నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ అందించారు. టెక్నీషియన్ సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయదలిచిన వారు 99595 89321 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.



చెలంచర్ల శ్రీనివాసరావు(ఫైల్)



పెంచలప్రతాప్ (ఫైల్)

అందుబాటులోకి వుడ్ చిప్పర్ మెషీన్



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో వ్యర్థాల తరలింపు ప్రక్రియలో ప్రధాన సమస్యగా మారిన భారీ చెట్ల కొమ్మల తరలింపును సులభతరం చేసేందుకు పారిశుద్ధ్య కార్మికులకు వుడ్ చిప్పర్ మెషీన్‌ను అందుబాటులోకి తెచ్చామని కమిషనర్ నందన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెషీన్ సాయంతో భారీ చెట్ల కొమ్మలను సైతం పొడిగా మార్చగలమని తెలియజేశారు. వుడ్ చిప్పర్ మెషీన్ వినియోగంతో వ్యర్థాల తరలింపు వాహనాల్లో తక్కువ స్థలంలోనే చెక్క పొడిని డంపింగ్ యార్డులకు సులభంగా తరలించగలమని, మెషీన్ నుంచి సేకరించిన పొడిని సేంద్రియ ఎరువులుగా కూడా ఉపయోగించుకోవచ్చని వివరించారు.

కేన్సర్‌పై అవగాహన తప్పనిసరి

నెల్లూరు(అర్బన్): శరీరంలో ఏర్పడే కేన్సర్ కణితలు, వాటికి సంబంధించిన ఆధునిక చికిత్సల గురించి ప్రజలు తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని మెడికవర్ స్పెషాలిటీ కేన్సర్ వైద్యుడు డాక్టర్ ఆర్.రమేష్‌బాబు తెలిపారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ వైద్యరంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల కేన్సర్‌కు మంచి చికిత్సలు అందుబాటులోకి వచ్చిందన్నారు. శరీరంలోని కణాలు క్రమం తప్పి పెరిగి ఒక కణితి(ట్యూమర్)గా మారడాన్నే కేన్సర్‌గా నిర్ధారిస్తామన్నారు. బినైన్ రకానికి చెందిన కణితలు నెమ్మదిగా పెరుగుతాయని, చుట్టు పక్కల ప్రాంతాలకు విస్తరించవని, అలాంటి కణితులను ఆపరేషన్ చేసి తొలగించవచ్చన్నారు. సాధారణంగా ఇలాంటి వాటి వల్ల ప్రాణాపాయం కాదన్నారు. రెండో రకం కణితులు చాలా వేగంగా పెరిగి రక్తం లేదా లింఫ్ ద్వారా ఇతర అవయవాలకు వ్యాపిస్తాయని, ఇవి ప్రమాదకరమన్నారు. ఇలాంటి వాటిని ముందస్తు స్క్రీనింగ్ పరీక్షల వల్ల వైద్య చికిత్సలు చేయించుకుంటే కేన్సర్ నుంచి బయట పడవచ్చన్నారు.

ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌పై అవగాహన

నెల్లూరు (టౌన్): స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫుడ్ అండ్ న్యూట్రిషన్, పర్సనల్ హైజీన్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ జ్యోతిర్మయి, పీడీ పద్మావతి, సఖీ వన్‌స్టాప్ అడ్మిన్ షహనాజ్, లీగల్ కౌన్సిలర్ ప్రశాంతి, పారా మెడికల్ సిబ్బంది లీలావతి పాల్గొన్నారు.

విద్యుత్ క్రీడాకారుల ఎంపిక నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజమహేంద్రవరంలో ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ సర్కిల్ హాకీ, టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు ఉంటాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ రామస్వామి వేలు శనివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యుత్ సిబ్బంది, జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు ఈనెల 7న ఆదివారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ట్రయిల్ సెలక్షన్స్ ఉంటాయని తెలిపారు. ఇతర వివరాలకు 90308 02038, 98854 46632, 95506 44396 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు జేవీవీ జిల్లా మహాసభలు

నెల్లూరు(అర్బన్): జనవిజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభలను స్థానిక అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఉన్న యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నామని ఆ వేదిక కోశాధికారి, న్యాయవాది పోతంశెట్టి విద్యాచరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకుడు చొప్పా రవీంద్రబాబు, జేవీవీ రాష్ట్ర సీనియర్ నాయకుడు శంకరయ్య పాల్గొంటారన్నారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆక్వా రైతుల సదస్సు జయప్రదానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈనెల 11వ తేదీ విజయవాడలో జరిగే ఆక్వా రైతుల సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు పిలుపునిచ్చారు. నగరంలోని బాలాజీ నగర్‌లో జిల్లా రైతు సంఘం ఆఫీస్‌బేరర్ల సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఈనెల 9న నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాలి వెంగయ్య, వెంకటకృష్ణయ్య, మూలం రమేష్, చంద్ర రాజగోపాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

నెల్లూరురూరల్: జిల్లా వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం విస్మరించిందని, పాలకుల ఆలోచనా విధానం మారకపోతే పచ్చని పొలాలు బీడు భూములుగా మారుతాయని బీజేపీ నేత మిడతల రమేష్ అన్నారు. ఆయన కలెక్టరేట్‌లో శనివారం మాట్లాడుతూ జిల్లాలో రైతులు సంవత్సరానికి మూడు పర్యాయాలు వరిసాగు చేస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వం గోదావరి జిల్లాల సాగును అనుసరించి పంటల సీజన్ నిర్ణయించి కొనుగోలు చేస్తోందన్నారు. 30 వేల మంది కౌలు రైతులు మద్దతు ధర లేక నష్టానికి పంటలు అమ్ముకున్నారని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

అనుమతులు అతిక్రమించిన నిర్మాణాలపై చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరంలో అనుమతులను అతిక్రమించి నిర్మిస్తున్న భవనాలను గుర్తించి చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం వారాంతపు సమీక్ష సమావేశాన్ని ఎస్ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భవన నిర్మాణ సమయంలో తప్పనిసరిగా అనుమతులు, ప్లాన్ నమూనాలు అందరికీ కనిపించేలా ప్రదర్శించేలా యజమానులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిర్మాణ అనుమతుల నిబంధనలను ఉల్లంఘించిన వారికి సీఓ, పీఓ నోటీసులు జారీ చేసి చార్జ్‌షీట్ ఓపెన్ చేయించాలని సూచించారు. నగరంలోని అన్ని డివిజన్లలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు తీసుకోకుండా భవనాలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిని గుర్తించి వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మురళి, సతీష్, రఘునాథరావు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

- స్థానిక మాగుంట లేఅవుట్ ప్రాంతంలోని సైన్స్ పార్క్ స్థలాన్ని కమిషనర్ నందన్ శనివారం పరిశీలించారు. సమీపంలోని భవన నిర్మాణాలను తనిఖీ చేసి అనుమతులను పరిశీలించారు. మినీ బైపాస్ ప్రాంతంలో ఎన్టీఆర్ పార్కును సందర్శించి వసతులు, సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం పార్కు పరిసర ప్రాంతాల్లో పాదచారుల మార్గాన్ని ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన దుకాణాలను తనిఖీ చేశారు. అక్కడి నుంచి స్థానిక గోమతి నగర్ ప్రాంతంలో ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు, నూతన భవన నిర్మాణాలను పరిశీలించారు. స్థానిక రామ్మూర్తి నగర్ ప్రాంతంలోని రైల్వే ట్రాక్ ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. జేమ్స్ గార్డెన్, వెంకట్రామాపురం ప్రాంతంలో జరుగుతున్న భవనాల డెమోలిషన్ పనులను తనిఖీ చేశారు. రామలింగాపురం అండర్ బ్రిడ్జి ప్రాంతంలో కాలువ నిర్మాణం పనులను తనిఖీ చేశారు. ఈఈ శేషగిరిరావు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమిస్తాం

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తగ్గకపోతే ఉద్యమిస్తామని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హేమంత్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక రావూస్ డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ జిల్లా కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన 17 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 10 కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదించడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థి కమిటీని నియమించారు. కళాశాల అధ్యక్షుడిగా మోహన్, కార్యదర్శిగా కుమారి భాగ్యలక్ష్మిలను ఎంపిక చేశారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు

మద్దతు ధర తగ్గిస్తే కఠినంగా వ్యవహరించాలి

- జేసీకి రైతు సంఘం నేతల వినతి

నెల్లూరు(అర్బన్): జిల్లాలో రెండో పంటకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.19,760 కన్నా తక్కువకు కొనుగోలు చేసే వ్యాపారులపై కఠినంగా వ్యవహరించి, కేసులు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు జేసీ కార్తీక్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం తరఫున సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు దామా అంకయ్య మాట్లాడుతూ జిల్లాలో పండించిన కేఎన్ఎం 1638, ఎంటీయూ 101, కేఎన్ఎం 733 రకం వరి ధాన్యానికి పక్క రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. కర్ణాటక, తమిళనాడు నుంచి ధాన్యం కోసం వచ్చిన వ్యాపారుల గురించి రైతులకు అవగాహన లేదన్నారు. రైసు మిల్లులు ఎక్కువగా ఉండే ప్రాంతమైన రాజుపాళెంలో బ్రోకర్లు వారి ఏజెంట్లను పంపించి దళారుల ద్వారా ధాన్యాన్ని పుట్టికి రూ.16 వేలు మాత్రమే ఇచ్చి కొనుగోలు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా తేమ పేరుతో మరికొంత ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారన్నారు. అందువల్ల కలెక్టరేట్ అధికారులు పరిశీలించి రైతులకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు షాన్‌వాజ్, జి.రమణయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యామాల మధు తదితరులు పాల్గొన్నారు.



జేసీ కార్తీక్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు



